పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా అనంతపురంలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రచారానికి ఫుల్‌స్టాప్

- రేపు మండలి ఎన్నిక పోలింగ్
- పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- నేడు సామగ్రి పంపిణీ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : కలెక్టర్



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికల ప్రచారాలకు శనివారం సాయంత్రంతో తెరపడింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఈనెల 13వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో 48 గంటల ముందుగా ప్రచారాలకు తెరపడింది. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ప్రచారాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి శనివారం వరకు ప్రచార హోరు కొనసాగింది. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపితోపాటు పిడిఎఫ్ పోటీగా ప్రచారాలు సాగాయి. వైసిపి తరుపున ప్రచార బాధ్యతలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చూడగా, టిడిపి తరుపున నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు బాధ్యత వహించారు. ఈ రెండు పార్టీలకు దీటుగా పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి తరుపున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతోపాటు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ప్రచారంలో పాల్గొన్నాయి. శనివారం ఆఖరి రోజు పెద్దఎత్తున ప్రదర్శనలు సైతం చేపట్టారు. ప్రచారాలు ముగియడంతో ఇక ఓటర్లను ఏ రకంగా ఆకట్టుకొచ్చునని అంతర్గత ఎత్తులు వేసేందుకు ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి. ప్రధాన రాజకీయపార్టీలు ప్రలోభాలకు పావులు కదుపుతున్నారు. చివరి నిమిషంలో డబ్బు పంపిణీ చేసేందుకు ఎత్తులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రధానంగా అధికార వైసిపి తరుపున ఆ బాధ్యతలను నియోజకవర్గ ఎమ్మెల్యేలు చూస్తున్నారు. పట్టభద్రులైన ఓటర్లు ఏ మేరకు వీటికి ఏ మేరకు లొంగుతారన్నదీ ప్రశ్నార్థకంగానే ఉండటం గమనార్హం.

68,341 మంది పట్టభద్రుల ఓటర్లు

అనంతపురం జిల్లా పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 68,341 మంది, 5564 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పట్టభద్రులకు 84 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలలో 97 మంది పిఓలు, 27 మంది ఒపివోలు,103 మంది పోలింగ్ అధికారులు-1లు, మొత్తం 407 మంది సిబ్బంది, అలాగే టీచర్స్ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల్లో 41 మంది పిఓలు,58 మంది ఒపివోలు,40 మంది పోలింగ్ అధికారులు-1 లు, మొత్తం 139 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సుమారు 1100 మంది పోలీసులు ఎన్నికల విధులలో పాల్గొంటున్నారని చెప్పారు.

పట్టభద్రులకు సంబంధించి కొత్తగా వచ్చిన జెంబో బ్యాలెట్ బాక్స్‌ను చూపుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ఏర్పాట్లు సిద్ధం : కలెక్టర్

మండలి ఎన్నికలు జరుగుతున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి 49 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది బరిలో ఉన్నారని కలెక్టరు ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఈనెల 13వ తేదీన జరుగుతున్న పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆమె తెలిపారు. శనివారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.

దామాషా పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల్లో సాధారణ ఎన్నికల్లో లాగా ఒక్కరి స్వస్తిక్ గుర్తు వేసే విధంగా కాకుండా బరిలోనున్న అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో క్రమ సంఖ్యలో ఓటు వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఓటు వేయడానికి వచ్చే ఓటర్లు ఓటరు స్లిప్పుతోపాటు, గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో వైలెట్ కలర్ స్కెచ్ పెన్ను ద్వారానే తమ ఓటును వినియోగించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఇచ్చే పెన్నుతో ఓటు వేసిన వాటిని మాత్రమే లెక్కింపులో పరగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు పెద్దగా ఉన్నందున జంబో బ్యాలెట్ బాక్సులను ప్రత్యేకంగా తెప్పించినట్టు వివరించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి ప్రత్యేకంగా, పట్టభద్రులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలుంటాయని తెలిపారు. పోలింగ్ ముగియగానే ఆయా జిల్లాలోనే స్ట్రాంగ్ రూముల్లో బ్యాలెట్ బాక్సులను భద్రపరచి, మరుసటి రోజు కౌంటింగ్ జరిగే అనంతపురం జెఎన్‌టియుకు చేర్చి స్ట్రాంగు రూముల్లో భద్రపరుస్తారన్నారు.

పోలింగ్ కేంద్రాలున్న విద్యా సంస్థలు ఒక్కటే సెలవు

పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్యాలయాల్లో మాత్రమే సాధారణ సెలవు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. తక్కిన చోట్ల యథావిధిగా విద్యాలాయాలు నడుస్తాయని చెప్పారు. ఎన్నికల్లో ఓటర్లుగానున్న వారు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను పెట్టుకుని వెళ్లవచ్చునని తెలిపారు. ఈనెల 16వ తేదిన కౌంటింగ్ రోజుకూడా కేవలం కౌంటింగ్ జరిగే ప్రాంతంలోనే సెలవు ఉంటుందన్నారు. తక్కిన చోట్ల ఎటువంటి సెలవూ ఉండదని చెప్పారు.

పీడీఎఫ్ అభ్యర్థులను
మండలికి పంపుదాం

- ప్రజావాణిని బలంగా వినిపిద్దాం..
- అడ్డదారుల్లో గెలవాలని చూస్తున్న వైసిపి
- ఓటుతోనే ఆపార్టీకి బుద్ధి చెప్పాలి
- అనంతలో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీ, విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలపై నిరంతరం పరితపించి, ప్రజావాణిగా నిలబడే పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించి వారిని మండలికి పంపుదామని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పశ్చిమ రాయలసీమ నియోజవర్గం నుంచి పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని కోరుతూ శనివారం నాడు అనంతపురంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సిఐటియు, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్, ఆవాజ్, కెవిపిఎస్, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో టవర్ క్లాక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సప్తగిరి సర్కిల్, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, కమలానగర్, సాయినగర్, గుల్జార్‌పేట తదితర ప్రాంతాల్లో ప్రచారం చేస్తూ పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలపై గళం వినిపించే పిడిఎఫ్ అభ్యర్థులను మండలికి పంపాలని కోరారు. మండలి ఎన్నికల్లో దొడ్డిదారిన గెలిచేందుకు అధికార పార్టీ వైసిపి అనేక కుట్రలు చేస్తోందన్నారు. దొంగ ఓట్లు చేర్పించడం, డబ్బులు పంచడం లాంటివి చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తోందన్నారు. ఇలాంటి పార్టీకి ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగస్తులు, ప్రజల పట్ల ఎప్పుడూ లేని విధంగా కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమాలను అణిచివేసి అక్కసు చాటుకుందన్నారు. ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన డిఎలు, పిఆర్‌సిని అమలుచేయలేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడా ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ఎదుర్కోవాలంటే పిడిఎఫ్ బలపరుస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగేంద్ర, వెంకటనారాయణ, ఆర్‌వి.నాయుడు, మన్నీల రామాంజి, ప్రకాష్, బాబు, ముర్తుజ, రామిరెడ్డి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప, వెంకటేశు, మెడికల్ రిప్రజెంటేటివ్ రాష్ట్ర నాయకులు మనోహర్, సురేంద్ర ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలీ, ముస్కిన్, మసూద్, ఇర్ఫాన్, గఫూర్, రైతు సంఘం నాయకులు నాగరాజు, కౌలురైతుసంఘం నాయకులు బాలరంగయ్య, డివైఎఫ్ఐ నాయకులు రాజు, శీను, నాగభూషణం, ఎర్రిస్వామి, ప్రసాద్, ఇస్మాయిల్, ఫక్రు, ఐద్వా నాయకురాలు నాగమ్మ, లాలెమ్మ, మాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాల వైసిపిని ఓడించండి
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు అన్ని రకాల అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి పార్టీకి బుద్ధి చెప్పి ప్రజా సమస్యలపై గళం విప్పే పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. మండలి ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలిచేందుకు పట్టభద్రుల ఓటర్లకు రూ.2వేలు, టీచర్లు అందులోనూ ప్రయివేటు టీచర్లకు రూ.5వేల చొప్పును ఇచ్చి ఓట్లు కొనుగోలు చేయాలని వైసిపి చూస్తోందన్నారు. తమ పాలన చూసి ఓటర్లు గెలిపిస్తారని ఇన్నాళ్లు భీకరంగా మాట్లాడిన అధికార పార్టీ నేతలు నేడు డబ్బులు పంపిణీ చేయడానికి దిగజారడం వారి పాలనా వైఫల్యాన్ని అంగీకరించారని చెప్పారు. గత ఎన్నికల నాడు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై నేడు డబ్బు ద్వారా గెలవాలని ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. సాధారణ ఎన్నికల వలే ఓట్లను కొని గద్దెనెక్కాలని చూస్తున్న వైసిపిని ఘోరంగా ఓడించి తమ చైతన్య స్థాయిని చాటాలని విద్యావంతులకు, ఉపాధ్యాయులకు సిపిఎం తరపును విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అత్యంత నిజాయితీగా, ఉన్నత విలువలతో ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక వాణి వినిపించారని తెలిపారు. కష్టజీవుల పక్షాన నిలిచాచారన్నారు. అలాంటి పిడిఎఫ్ పక్షాన పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికు గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల్లో వైసిపి పాల్పడుతున్న అక్రమాలను అడ్డుకోవాలని, పోలింగ్ రోజు పిడిఎఫ్ అభ్యర్థులకు అండగా నిలవాలని సిపిఎం శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో పారదర్శక ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, ఎన్నికల నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారి ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్స్, ఐ పాడ్, టాబ్స్, ఇతర ఎలెక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోనికి తీసుకువెళ్లడానికి అనుమతి లేదన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. ఎవ్వరూ రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదన్నారు. డబ్బు, మద్యం, వస్తువులు ఎర చూపి ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రలోభాలకు పాల్పడకూడదన్నారు. పోలింగ్ బూత్ లోపల ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా, అతిక్రమించినా, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా ఎన్నికల కమిషన్ వారికి, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద వేచి ఉన్నా వైసిపి నేతలు

ప్రత్యేక వాహనంలో డబ్బులను తరలిస్తున్న అధికార పార్టీ నాయకులు

ఉపాధి కల్పనలో ఏపీ దేశానికే ఆదర్శం

రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల : ఉపాధి కల్పన, పెట్టుబడుల సాధనలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా యువతకు ఉపాధి కల్పన జరిగిందన్నారు. మూడున్నరేళ్లలో సీఎం జగన్ ఏకంగా 2.7 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 4 లక్షల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు యువతకు కల్పించారని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈ ల స్థాపన ద్వారా రాష్ట్రంలో 13.65 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందని, పరిశ్రమల్లో 75 శాతం రిజర్వేషన్ కింద ఉద్యోగ అవకాశాలు రాష్ట్రంలోని స్థానిక యువతకే ప్రభుత్వం అందించిందని అన్నారు. యువతకు ఉపాధి కల్పనపై ఏపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను అయన వీడియో సందేశం ద్వారా శనివారం మీడియాకు వెల్లడించారు. పెట్టుబడుల సాధన, ఉపాధి కల్పన, సంక్షేమ పథకాలు, డీబీటీ రంగాల్లో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. విశాఖలో ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ద్వారా రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్లు గుర్తు చేశారు. తద్వారా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు

‘పురం’లో ప్రజాస్వామ్యం అపహాస్యం..!

- మండలి ఎన్నికల్లో ఓటు కోసం అక్రమాలు
- వరదలై పారిన డబ్బు
- అధికార పార్టీ ఆర్‌కె ఫంక్షన్ హాల్.. టిడిపి ఎమ్మెల్యే నివాసం వద్ద డబ్బులు పంపిణీ.?

ప్రజాశక్తి-హిందూపురం

శాసన మండలి ఎనికల నేపథ్యంలో హిందూపురంలో ప్రజాస్వామ్యాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు అపహాస్యం చేస్తూ గత రెండు రోజుల నుంచి డబ్బును వరదలై పారిస్తోంది. అధికార పార్టీ వైసిపి నాయకులు ఆర్‌కె.ఫంక్షన్ హాల్ వద్ద డబ్బులు పంపిణీ చేస్తే, టిడిపి నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద రహస్యంగ పంపిణీ చేశారు. పట్టభద్రులకు అధికార పార్టీ రూ.1000 ప్రతిపక్ష టిడిపి రూ.500 పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఇరు పార్టీలూ ఉపాధ్యాయులకు రూ.5000 ఇచ్చినట్లు సమచారం. టిడిపి వార్డు ఇన్‌ఛార్జుతో పంపిణీ చేయగా, అధికార పార్టీ డబ్బుల పంపిణీకి ఏకంగా అనంతపురం నుంచి ఓ ప్రత్యేక బృందాన్ని రప్పించి పంపిణీ చేశారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మండలి ఎన్నికలను అధికార వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో సత్తా చాటితే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా గెలుపు మాదేనన్న సంకేతాలను ప్రజల్లో బలంగా పంపినట్లు అవుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించి, ఎంత మంది ఓటర్లు ఉన్నారు.? అందులో తమ పార్టీ వారు ఎంత మంది ఉన్నారు.? మిగిలిన వారిని ఎలా ప్రశన్నం చేసుకోవాలి.? అన్న దానిపై చర్చించారు. శనివారం నాడు ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. డబ్బుల పంపిణీ చేసే సమయంలో వార్డు కౌన్సిలర్లు, బూత్ కమిటీ కన్వీనర్ల మధ్య తేడా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో డబ్బును తమ మనుషుల చేతనే పంపిణీ చేయిస్తామని ముఖ్య నేతలు చెప్పడంతో కౌన్సిలర్లు, బూత్ కన్వీనర్లు కంగుతిన్నారు. తెలుగుదేశం పార్టీ కూడా ఈ ఎన్నికల్లో గెలవాలని తమదైన శైలిలో ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. తమదైన శైలిలో డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. హిందూపురంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం కేంద్రంగా నాయకులు నగదు పంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ప్రయివేటు పాఠశాల, కళాశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు ఓటు హక్కు కల్పించింది. దీంతో పాటు ఆయా పాఠశాల, కళాశాలల యాజమాన్యలకు అందించి, వారి ద్వారా ఓటు హక్కు ఉన్నా ఉపాధ్యాయులకు అందించినట్లు వార్తలు వినపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓటర్లు ఎలాంటి తీర్పును ఇస్తారన్న సందిగ్ధంలో అందరిలోనూ నెలకొంది.

దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

దళితులకు రక్షణ కల్పించి, వారిపై దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయాలని, దళితులపై వరస దాడులకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. శనివారం వజ్రకరూర్ మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో దాడికి గురైన దళితులను ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సాకే హరి, దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి అధ్యక్షులు మీనుగ గోపాల్, ఎమ్మార్పీఎస్ రాజు, బీఎస్పీ ఎదురూరు మల్లికార్జున, ఎపి ఎమ్మార్పీఎస్ సాకే ఒబులేసు, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు రాజ శేఖర్, ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షులు రమేష్. విసికె నియోజకవర్గ అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ.. దళితులపై నిరంతరం దాడులు జరుగుతున్నా పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. దళితులకు రక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ రక్షణ కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ఎస్సీ, ఎస్టీలను రాజకీయ కోణంలో చూడరాదన్నారు. పేదలుగా, అను నిత్యం అణచివేత, దోపిడీ, పీడనలకు గురవుతున్న వారీగా చూడాలన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యం తీసుకరావడానికి కృషి చేయాలని కోరారు. ఇప్పటికీ గ్రామాల్లో కుల వివక్ష చూపడం బాధాకరమన్నారు. సామాజిక చైతన్యం కల్పించాలన్నారు. సంఘాల నాయకులు రేకలకుంట రామాంజనేయులు, రామకృష్ణ, రవి, పాల్యా గణేష్ నాయక్, యశ్వంత్, రామాంజనేయులు, ప్రతాప్ తదితరలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ సాయిరాం

పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించాలి

విద్యార్థుల తల్లిదండ్రులకు డిఇఒ సాయిరాం సూచన

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, పిల్లలను చదువుకునే విధంగా ప్రోత్సహించాలని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. సాయిరాం సూచించారు. శనివారం నగరంలోని కస్తూర్బా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్-2లో టీచర్లు, తల్లిదండ్రులతో నిర్వహించిన కమిటీ సమావేశాలకు డిఇఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదోతరగతి పరీక్షలు దగ్గరకు వస్తున్నాయన్నారు. ప్రతి విద్యార్థీ తమ అమూల్యమైన సమయాన్ని వంద శాతం ఉపయోగించుకునే విధంగా పరీక్షల కోసం సంసిద్ధులయ్యే విధంగా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. పరీక్షల పట్ల వారికి ఉన్న భయాన్ని కూడా తొలగించేటట్లు తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డివైఈవో పద్మప్రియ, హెచ్ఎంఒ, ఏపీవో మారుతి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానంలో ఉండాలని కొర్రపాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో దేనినైనా సాధించవచ్చన్నారు. తల్లిదండ్రుల కష్ట, నష్టాలను గుర్తించి విద్యార్థులు విద్యపైన మనసుపెట్టి చదవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

శింగనమల : పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్నత ఓటు వేసి గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, ప్రజా నాట్యమండలి నాయకులు ఓటర్లను కోరారు. శనివారం శింగనమల మండల కేంద్రంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, రైతు సంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వ్యకాసం మండల కార్యదర్శి సుంకన్న ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా గొంతుకను చట్ట సభల్లో వినిపించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, తులసి, నల్లప్ప, మునెప్ప, కేశప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సామాన్య ప్రజల గొంతుకను చట్ట సభల్లో వినిపించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల సెక్రెటరీ శివశంకర, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి ఎం.రామయ్య, మధ్యాహ్న భోజన ఏజెన్సీ సంఘం మండల కార్యదర్శి జయమ్మ, వెంకటమ్మ, ఇందిర, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

ఉరవకొండ : ఈ నెల 13వ తేదీన జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, డిప్యూటీ తహశీల్దార్ గురుప్రసాద్, సిఎస్‌డిటి రమేష్‌బాబు తదితరులు పరిశీలించారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నెట్టికంటిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

గుంతకల్లు రూరల్ : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామసుందర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి దర్శనం గావించారు. అనంతరం వేద పండితులు స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదం అందజేశారు. వారికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి ఆశీర్వచనాలు అందించారు.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలన

ఆత్మకూరు : ఆత్మకూరు మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఇన్‌ఛార్జి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుజాత పరిశీలించారు. ఏయే టీకాలు ఎంతమంది పిల్లలకు, గర్భిణులకు ఇచ్చారో ఆరాతీశారు. పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలకు సరైన వ్యవధిలో తప్పక వేయించాలన్నారు. అప్పుడే పిల్లలకు వ్యాధుల నుండి రక్షణ ఉంటుందన్నారు. సరైన పోషకాలు ఉన్న ఆహారం ఇవ్వడం ద్వారా పిల్లల్లో మంచి ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన భద్రతా వారోత్సవాలు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని తలారిచెరువు గ్రామం వద్దనున్న పెన్నా సిమెంట్ పరిశ్రమలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాకరీస్ కేశవులు మాట్లాడుతూ.. కార్మికులు తప్పనిసరిగా భద్రత ప్రమాణాలను పాటించాలని కోరారు. పరిశ్రమలో భద్రతా పథకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ పివి కృష్ణయ్య, బోయరెడ్డిపల్లి పెన్నా సిమెంట్స్ జిఎం జగదీశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్లు సత్యసాయి, సుబ్రహ్మణ్యం, ఇతర ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

In the Court of the Junior Civil Judge Puttaparthy

O.S.No.120/2019

Between:
C.Nagamani ...Plaintiff
And
T.Parvathamma & Others ...Defendants

పై నెంబరు దావాలోని 2,3,4, ప్రతివాదులకు దావా సమన్లు

To,
D2: T.Shobha Rani W/o Late Sadasiva Reddy.
D3: T.Asulini D/o T.Sadasiva Reddy.
D4: T.Gowthami D/o T.Sadasiva Reddy.
Defendants 2 to 4 residing near Army Canteen, Papampeta, Anantapur Town, Anantapur District.

ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా పై దావాలోని వాది మీ నుండి దావా మొత్తము రాబట్టుకొనుటకు గాను పై కోర్టులో దావా దాఖలు చేసినది. సదరి విషయముపై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్నవి యెడల మీరు 15-03-2023వ తేదిన ఉదయం 10.30 గం||లకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదనను పై కోర్టువారికి తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు పై దావాను తీర్మానము చేయుదురని యిందుమూలకముగా మీకు తెలియజేయడమైనది.

(By Order of the Court)

D.Mahesh Reddy, Advocate
Puttaparthy.

పట్టభద్రుల చూపు పిడిఎఫ్ వైపు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో శనివారంతో ప్రచారాల గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో జరిగిన ప్రచార సరళి, ఆ సమయంలో వస్తున్న ఆదరణ అంతా చూసినప్పుడు పట్టభద్రులు పిడిఎఫ్ (ప్రోగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నట్టుగా స్పష్టమవుతోంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా వైసిపి, టిడిపి, పిడిఎఫ్ మధ్య త్రిముఖ పోరులా సాగుతున్నప్పటికీ అత్యధిక మంది ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పోతుల నాగరాజు వైపే మొగ్గు చూపుతున్నారన్నది రాజకీయ విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు.

సాధారణ ఎన్నికలకు భిన్నంగా మండలి ఎన్నికలు జరుగుతాయి. ఇక్కడ సాధారణ ఓటింగు లాగా కాకుండా దామాషా పద్ధతిలో ప్రాధాన్యతల ప్రకారం ఓటింగు చేసే వీలుంది. ఈ ఓటింగు ప్రక్రియలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి పిడిఎఫ్ వైపు పట్టభద్రులు మొగ్గు చూపుతూ వస్తుండటం ఆనవాయితీ. ఈ ఎన్నికల్లో అత్యధికంగా పిడిఎఫ్ అభ్యర్థులే విజయం సాధిస్తూ వస్తుండటం గమనార్హం. ప్రొఫెసరు నాగేశ్వర్, చుక్కా రామయ్య, ఎంవిఎస్.శర్మ, డి.రామిరెడ్డి, వి.బాలసుబ్రమణ్యం, కెస్.లక్ష్మణరావు, వై.శ్రీనివాసులరెడ్డి, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి, డాక్టర్ గేయానంద్ ఇలాంటి ప్రముఖులందరూ ఈ జాబితాలోకి వస్తారు. 2007 ఎన్నికల్లోనూ పశ్చిమ రాయలసీమ నుంచి తొలిసారిగా పిడిఎఫ్ అభ్యర్థిగా గేయానంద్ గెలుపొందారు. ఈ ఎన్నికల్లో గెలుపొందేందుకు అప్పటి అధికారి పార్టీ అయిన కాంగ్రెసు అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి పెద్దఎత్తున డబ్బులు ఖర్చు పెట్టినా గెలుపొందలేకపోయారు. ఆ తరువాత 2013 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత మూలంగా ఓటర్లు వైసిపి వైపు మొగ్గు చూపారు. అయితే అప్పుడు ఎన్నికైన ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరుగుతున్న ఈ ఎన్నికల్లో వైసిపి తరపున మరోమారు వెన్నపూస గోపాల్ రెడ్డి తనయుడు వెన్నపూస రవీంద్రారెడ్డి బరిలో దిగినప్పటికీ పెద్దగా స్పందన కనిపించడం లేదన్నది రాజకీయవర్గాల్లో సాగుతున్న చర్చ.

శాసనమండలికి వన్నె తెచ్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

పిడిఎఫ్ తరుపున గెలుపొందిన ఎమ్మెల్సీలు తమ నీతి, నిజాయతీతో శాసనమండలికే వన్నె తెచ్చారు. శాసనమండలి సభ్యులుగా వారికి లభించే వేతనాలు, అలవెన్సులను వారి సొంతానికి ఒక్క రూపాయి వాడుకోలేదు. వారికి వచ్చిన సొమ్మును ప్రజా ఉద్యమాలకే వెచ్చించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వం ఉచితంగా ఖరీదైన ఇళ్ల స్థలాలను కేటాయించినా వాటిని తిరస్కరించారు. ఒక రాజకీయ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలుపొంది అధికార పార్టీలోకి ఫిరాయించడం సర్వ సాధారణంగా మారిన

ప్రస్తుత రోజుల్లో ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయతీగా, పాదర్శకంగా వ్యవహరిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఏదో ఒక రాజకీయ పార్టీ వైపు ఒరిగిపోకుండా విమర్శనాత్మకతగా ఉంటూ నిర్మాణాత్మక పాత్రను పోషిస్తున్నారు.

విద్యావంతులకు స్థానమివ్వారా..?

శాసనమండలి పట్టభద్రులకు ఐదు స్థానాలే ఉన్నాయి. విద్యావంతుల వాణిని వినిపించడానికి ఇక్కడ నుంచే ఎన్నికైన ఎమ్మెల్సీకే అవకాశముంటుంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని పట్టభద్రులకు ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టభద్రుల స్థానంలో వైసిపి, టిడిపి తమ అభ్యర్థులను బరిలో దింపి వాటిని తమ ఖాతాల్లో వేసుకోవాలని చూస్తున్నాయి. ప్రధాన రాజకీయ పక్షాలు సర్పంచి నుంచి ఎంపీ వరకు తమ

పోతుల నాగరాజు

కత్తి నరసింహారెడ్డి

అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుంటున్నాయి. వారు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సమస్యలపై వారు స్పందిస్తున్న తీరు ఏమిటో అందరికీ తెలిసిందే. పైగా రాజయకీయ పార్టీల నుంచి ఎన్నికైన ప్రతినిధులకు పార్టీ అజెండా తప్ప స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఉండదనేది వేరే చెప్పనక్కర్లేదు. అటువంటి పరిస్థితుల్లో ప్రజా సమస్యల విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థుల వైపు యువత మొగ్గు చూపడం సహజమే. అందులో భాగంగానే పిడిఎఫ్ తరుపున నిలబడిన పోతుల నాగరాజు ప్రచారంలో ఈరకమైన స్పందన కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రశ్నించే గొంతుకగా పిడిఎఫ్

శాసనమండలి లోపల, బయట ప్రశ్నించే గొంతుకలుగా పిడిఎఫ్ అభ్యర్థులుంటు ఉన్నారు. గతంలో ఎమ్మెల్సీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నుంచి ఎన్నికైన డాక్టర్ గేయానంద్ కూడా ఈ రకంగా రాయలసీమ సమస్యలపై మండలిలో పోరాటం చేయడమే కాకుండా కడప ఉక్కు కర్మాగారం కోసం దీక్షలు సైతం చేశారు. ఆ తరువాత ఈ ప్రాంత సమస్యలపై పోరాటం సాగిస్తున్నారు. ఇదే బాటలో పోతుల నాగరాజు కూడా రాయలసీమ ప్రాంతాభివృద్ధి, సమస్యలపై పోరాటాలు సాగించారు. ప్రచారంలోనూ ఉపాధి, నీటి వనరులు, పరిశ్రమల ఏర్పాటుతోపాటు, ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారానికి చేసే కృషి గురించే ఓటర్లకు వివరించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఇప్పటి వరకు ప్రజా సమస్యలపై సాగించే పోరాట ఒరవడినే కొనసాగించేందుకు పోతుల నాగరాజు సిద్ధంగా ఉన్నారన్న అభిప్రాయం పట్టభద్రుల ఓటర్లలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే వచ్చే మండలి ఎన్నికల్లో ఆయన వైపు పట్టభద్రులు మొగ్గుచూపుతున్నారడానికి నిదర్శనమని చెప్పవచ్చు.

దళారుల ప్రమేయం లేకుండా కూరగాయల విక్రయాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుండి నేరుగా ప్రజలు కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పిఅండ్‌ఆర్ లా ఫర్మ్ అధ్యక్ష, కార్యదర్శులు గౌని ప్రతాప్‌రెడ్డి, దేవి రెడ్డిపల్లి రాజేష్ అధికారులను కోరారు. వివిధ గ్రామాల నుండి రైతులు కష్టపడి పండించిన పంటలను నిద్రాహారాలు మాని రాయదుర్గం పట్టణానికి తీసుకొచ్చి అర్ధరాత్రి డబ్బు వచ్చిన కాడికి అమ్మి వెళ్తున్నారన్నారు. దళారుల ప్రమేయం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. కొనుగోలుదారులు అధిక ధరలు పెట్టి కూరగాయలు, ఆకుకూరలు కొనాల్సి వస్తోందన్నారు. దీంతో ఇటు రైతులకు అటు ప్రజలకు ప్రయోజనం చేకూరడం లేదన్నారు. రైతులు ప్రజలు నేరుగా అమ్మకం, కొనుగోలు జరిపేలా చర్యలు తీసుకుంటే ఇటు రైతులు అటు ప్రజలు ప్రయోజనం పొందుతారన్నారు. ఇందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి రైతులు నేరుగా ప్రజలకు కూరగాయలు అమ్మేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, తహశీల్దారు మారుతీలకు లేఖలు పంపామని తెలియజేశారు.

మద్యం అమ్మకాలకు రెక్కలు..!

ఎలక్షన్ కోడ్ తుంగలో తొక్కి...

బ్లాక్ మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మద్యానికి రెక్కలు వచ్చాయి. బ్లాక్ మార్కెట్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం నాలుగు గంటలకు మద్యం షాపులను మూసివేశారు. అప్పటికే ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుండి మద్యం బాక్సులు బ్లాక్ మార్కెట్లకు తరలివెళ్లాయి. శనివారం సాయంత్రం నుండే రూ.150 ఉన్న క్వాటర్ బాటిల్ ధర రూ.250, రూ.120 ఉన్న క్వాటర్ బాటిల్ రూ.200లకు, రూ.200 లకు విక్రయించే క్వాటర్ బాటిల్‌ను రూ.300 లకు అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఓటింగ్ నిర్వహించే 48 గంటల ముందే మద్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలను అడ్డుపెట్టుకుని అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ నడ్డి విరుస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు. మద్యం అధిక ధరలకు విక్రయించడంపై ఎస్‌ఐ రంగడు యాదవ్‌ను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు మద్యం అక్రమ విక్రయాలపై స్పెషల్ టీములను ఏర్పాటు చేశామన్నారు. మద్యం విక్రయిస్తూ ఎవరైనా దొరికితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పట్టభద్రులు, నిరుద్యోగుల గొంతుకగా పోతుల నాగరాజు

ప్రజాశక్తి -అనంతపురం

ప్రజా, విద్యారంగ సమస్యలపై సుదీర్ఘ పోరాటం ఆయన నైజం. నేడు పట్టభద్రులు, నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకగా ప్రజాదరణ చూరగొన్నారు. యువతకు నేనున్నానన్న సంకేతాలను తీసుకెళ్లారు. ఆయనే పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు. కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల మదిలో స్థానం సంపాదించుకున్నారు. పదిహేనేళ్ల క్రితమే ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా కొలువు సాధించిన ఆయన సమాజానికి తనవంతు సేవలు అందించాలని ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఎస్‌కె యూనివర్సిటీలో విద్యారంగ, నిరుద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. సమస్యల పరిష్కారానికి కదం తొక్కారు.

అదే ఊపుతో నేడు ప్రజల పక్షాన

ప్రజా పోరాటాల స్ఫూర్తితో నేడు ప్రజల పక్షాన

కలిసొస్తున్న ప్రజా ఉద్యమాల అనుభవం

విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాడేతత్వం

మండలిలో గొంతు విప్పేందుకు నడుం బిగించారు. సీమ జిల్లాలను కలియతిరిగి ఉద్యోగ, పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలను గుర్తించారు. మెజారిటీ వర్గాలలో ఆదరణ పెంచుకున్నారు. రెండు రోజుల్లో జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష అభ్యర్థుల కంటే విశేష జనాధారణ పొందారు. స్వచ్ఛందంగా విద్యార్థి, యువజన, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాలు అండగా నిలిచాయి. ఇక ఉద్యోగ నేతలు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లతో గట్టెక్కనున్నారని పట్టభద్రులు, నిరుద్యోగ, ఉద్యోగులు, యువత అభిప్రాయపడుతున్నారు.

సాధారణ కుటుంబం నుంచి..

బలహీన వర్గాలకు చెందిన సాధారణ కుటుంబం నుంచి వచ్చి ప్రజాధరణ దక్కించుకున్నారు. వ్యవసాయ కుటుంబం, ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలు చేపట్టారు. అన్ని వర్గాల జనాధరణతో శాసనమండలిలో తన గళాన్ని మరింతగా వినిపించేందుకు సంసిద్ధులయ్యారని సీమ ప్రజానీకం పేర్కొంటున్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

తుగ్లక్ జగన్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

నిరంతరం సమస్యలపై పోరాడే
పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకష్ణ

ప్రజాశక్తి గుంతకల్లు

రాష్ట్రంలో విధ్వంస అరాచక పాలన చేస్తున్న తుగ్లక్ జగన్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు బుద్ధి చెప్పేందుకు ఇదే మంచి అవకాశమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు స్థానాల్లో పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ఐతే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఏమన్నా పిచ్చి పట్టిందేమో అర్థం కాలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎక్కడా నామినేషన్ వేయడానికి రానీయకుండా చేశాడని మండిపడ్డారు. ఆఖరికి అభ్యర్థులు మారువేషాల్లో కలెక్టర్ ఆఫీసు గోడలు దూకి నామినేషన్ వేసే పరిస్థితికి దిగజార్చడం సిగ్గుచేటన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల్లో ఇలా దండయాత్రలు చేయలేదని అన్నారు. సెల్‌ఫోన్ నెంబరుపై 75 ఓట్లు ఉన్నట్లుగా దొంగ ఓట్లను చేర్చడం ఎన్నికల్లో వైసిపి అక్రమాలకు సాక్ష్యం అన్నారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను అధికారులతో బెదిరింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఉపాధ్యాయులకు రూ.5 వేలు, పట్టభద్రులకు రూ.2 వేలు డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు. జగన్‌రెడ్డి అసెంబ్లీలో శాసన మండలే అవసరం లేదని తీర్మానం చేసి ఢిల్లీ పార్లమెంటుకు పంపారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు ఓటు వేయాలని అడిగే అర్హత జగన్‌కు లేదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు, భూమిరెడ్డి గోపాల్‌రెడ్డికి రెండవ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాల నోరు నొక్కడానికి తెచ్చిన జీవో నెంబర్ 1 ని అడ్డుకునేందుకు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఏర్పడిందన్నారు. ఈనెల 25వ తేదీన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసిపి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, ఉరవకొండ తాలూకా కార్యదర్శి జె.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం రాయదుర్గంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ఏజెంట్లు సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ నియంత్రిత్వ ధోరణిని అలంబిస్తున్నారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఒక్క ప్రాజెక్టు, లక్ష ఎకరాలకు సాగునీరు, కళాశాల, పరిశ్రమ కొత్తగా ఏర్పాటు చేశారా.. అని ప్రశ్నించారు. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులు రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయి అని సిఎం చెప్పగా అందులో కనీసం నాలుగోవంతు పరిశ్రమలు ఏర్పడినా తాను మీసం గొరిగించుకుంటానన్నారు. అసెంబ్లీలో పూర్తి మెజారిటీ ఉన్న జగన్ మండలి ఎన్నికల్లో కూడా ప్రతిపక్షాలు ఉండరాదని కుట్ర చేస్తున్నాడన్నారు. పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులు ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజుకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని, ద్వితీయ ప్రాధాన్యత టిడిపి బలపరుస్తున్న అభ్యర్థులకు వేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు సంజీవప్ప, రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : శాసన మండలిలో ప్రశ్నించేవారు లేకుండా చేసుకునేందుకు సీఎం జగన్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. శనివారం ఆయన పట్టణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరితో కలిసి సమావేశం నిర్వహించారు. సోమవారం జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తినరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు, టీడీపీ భూమిరెడ్డి రామభూపాల్‌రెడ్డికి రెండవ ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలని కోరారు. సీపీఐ, టీడీపీ నాయకులు సంజీవప్ప, గోపాల్, వైపీ.రమేష్, మారుతీచౌదరి, శ్రీనివాసరెడ్డి, శర్మాస్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. హైదరాబాదులోని భవాని కాలనీకి చెందిన అశోక్‌కుమార్ యాదవ్ అలియాస్ నిఖిల్ (24), రాజేష్ అనే యువకులు హైదరాబాదు నుంచి బెంగళూరుకు ద్విచక్ర వాహనం (స్పోర్ట్స్ బైక్)లో బయలుదేరారు. కరిడికొండ గ్రామం వద్ద ముందుగా వెళుతున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నిఖిల్, రాజేష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిఖిల్ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పుట్లూరు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్లూరు మండలం బాలాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాలాపురం గ్రామానికి చెందిన నాగమ నాయుడు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చుట్టుపక్కల వారు గమనించి అతన్ని తాడిపత్రిలోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనం కాల్చివేత

ప్రజాశక్తి-పుట్లూరు

గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని కాల్చివేసిన సంఘటన మండల పరిధిలోని దోసలేడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దోసలేడు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి తన ఇంటిముందు ఎప్పటిలాగే ద్విచక్రవాహనాన్ని ఉంచాడు. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై పెట్రోల్ పోసి అంటించారు. పెట్రోల్ ట్యాంకు పేలడంతో ఆ శబ్దానికి చంద్రశేఖర్ బయటకు వచ్చి చూశాడు. కాలి బూడిదైన వాహనాన్ని చూసి ఆవేదన చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

తాడిపత్రి మండల పరిధిలోని జంబులపాడు గ్రామం వద్దనున్న ఆర్జస్ స్టీల్ ప్లాంట్‌లో శనివారం తెల్లవారుజామున కార్మికుడు రాఘవేంద్ర (30) మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. తాడిపత్రి పట్టణంలోని నందలపాడులో నివాసముంటున్న రాఘవేంద్ర ఆర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తూ జీవనం సాగిస్తున్నాడు. విధుల్లో భాగంగా శుక్రవారం నైట్ షిఫ్ట్‌కు వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున డ్యూటీ సమయంలో అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాఘవేంద్ర మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య మంజుల, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అర్ధరాత్రి చనిపోతే శనివారం తెల్లవారుజామున స్టీల్ ప్లాంట్ వారు సమాచారం ఇచ్చారని మృతుడి భార్య మంజుల ఆవేదన చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పరిశ్రమలో భద్రత కరువైందన్నారు. ప్రమాదం జరిగితే సమాచారం ఇవ్వడానికి యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందన్నారు. రాఘవేంద్ర కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని చెప్పారు. త్వరలో పరిశ్రమల కార్మికులతో కలిసి వారి హక్కుల పైన పోరాటాలు చేస్తామన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు..

ప్రజాశక్తి గుత్తి

గుత్తి పట్టణంలోని జెండా వీధికి చెందిన జాఫర్ అనే ఉపాధ్యాయుడు శనివారం మరణించాడు. జాఫర్ గుత్తి ఆర్‌ఎస్ లోని నెంబర్-2 పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. జాఫర్ మతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాప వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన రాచేపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మిని పోలీసులు కాపాడారు. రాచేపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి భర్తతో గొడవపడింది. శనివారం మనస్తాపంతో ఆమె శింగనమల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చింది. అదే సమయంలో హైవేలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది బాషా, ఇక్బాల్, గిరి మహేష్, సుంకన్నలు ఆమెను కాపాడారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యా యత్నం నుంచి మహిళను కాపాడిన శింగనమల ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న నెలవారీ పోటీల్లో భాగంగా అనంతపురం గుల్జార్‌పేటలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టరు గోవిందరాజు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని ప్రశ్నించడం లేదా ప్రయత్నం చేయడం అలవర్చుకోవాలన్నారు. మనలో పొగమంచు ఒకరి ప్రయోజనం కోసం సృష్టించబడిన మూఢ నమ్మకాలలో మునిగిపోయిందన్నారు. మనం పడిపోవడం ద్వారా చాలా కోల్పోతామన్నారు. విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దడంలో విజ్ఞాన కేంద్రం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమానికి కన్వీనర్ ఎ.జి.రాజమోహన్ అధ్యక్షత వహించారు. మూఢనమ్మకాల నుండి మనల్ని మనం దూరంగా ఉంచుకుని, మన మనస్సులో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకున్నప్పుడే మన విద్యకు అర్థం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, ఎంఎన్‌టి రాజు పాల్గొన్నారు. కోకన్వీనర్లు ఈరన్న, లక్ష్మణ్, సాహితీ పిఫియా, మధు, విజ్ఞాన కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

ప్రజాశక్తి-నార్పల

ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా శనివారం సాయంత్రం నుండి మద్యం దుకాణాలను మూసి వేయించినట్లు చేయించినట్లు ఎస్‌ఐ రాఘవరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు 48 గంటల పాటు మద్యం దుకాణాలు మూసివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా, అక్రమంగా మద్యం విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ఉండే దుకాణాలను సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు మూసివేయాలని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది తెలిపారు.